నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 29 డిసెంబర్ 2023 | NAGARKURNOOL

దరఖాస్తు ఫారాల కోసం పోటీపడుతున్న ప్రజలు

ప్రజాపాలన ప్రారంభం


మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 23వ వార్డులో దరఖాస్తుదారుల సందడి

- గ్యారెంటీలకు దరఖాస్తుల స్వీకరణ
- గ్రామాల్లో నెలకొన్న సందడి
- పోటెత్తిన ప్రజలు.. అరకొరగా దరఖాస్తులు
- గ్యారెంటీలపై సందేహాలకు సమాధానాలు కరువు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, అధికారులు
- జనవరి 6 వరకు స్వీకరణ

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : గ్రామాల్లో కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన గ్యారెంటీల అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశంతో గ్రామాలు, పట్టణాల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. దీంతో పింఛన్లు, రేషన్ కార్డులు, రూ.2,500 సాయం, రూ.500కి సిలిండర్, రైతు భరోసా, యువ వికాసంలాంటి పథకాలకు లబ్ధిపొందేందుకు ప్రజలు పెద్దఎత్తున సభలకు హాజరయ్యారు. ఫలితంగా ఉమ్మడి పాలమూరులోనూ దరఖాస్తుదారులతో సందడి వాతావరణం నెలకొంది. కాగా, దరఖాస్తుల స్వీకరణలో సభలకు హాజరైన అధికారులకు ప్రజల నుంచి తలెత్తిన పలు సందేహాలకు సమాధానం కరువైంది. దీంతో ప్రభుత్వం స్పందించాల్సిందిగా ప్రజల నుంచి డిమాండ్లువిని పిస్తున్నాయి.

గ్యారెంటీలకు దరఖాస్తులు.. సందేహాలకు సమాధానాలు కరువు..?

ఆరు గ్యారెంటీలకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రూ.500కే సిలిండర్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా, రూ.5లక్షల యువ వికాసం, మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.2,500 సాయం, రూ.4వేల పింఛన్లు, రేషన్ కార్డులు, రైతు భరోసాలాంటి హామీలను ఇచ్చింది. అధికారంలోకి రావడంతో ఇప్పటికే ఆరోగ్యశ్రీ, ఉచిత ప్రయాణం ప్రారంభించగా మిగిలిన ఐదు గ్యారెంటీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో గురువారం ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో సభలను నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లతోపాటుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పలు శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సభల్లో ప్రజల నుంచి గ్యారెంటీల కోసం దరఖాస్తులను స్వీకరించారు. కాగా పెద్ద ఎత్తున సభలపై ప్రచారం జరగడంతో గ్రామాలు, వార్డుల్లోని ప్రజాపాలనకు హాజరయ్యారు. అధికారులు ఊహించినదానికంటే అధికంగా ప్రజలు రావడంతో దరఖాస్తుల సమస్య తలెత్తింది. దీంతో చాలా మంది దరఖాస్తు జిరాక్స్‌లను తీసుకొచ్చి దరఖాస్తులు చేసుకొన్నారు. ఇది జిరాక్స్ కేంద్రాల నిర్వాహకులకు పంట పండించింది. ఒక్కో జిరాక్స్‌ను రూ.10నుంచి రూ.40 వరకు విక్రయించడం గమనార్హం. కాగా గ్యారెంటీలకు దరఖాస్తులపై ప్రజలకు సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే వృద్ధాప్య, ఇతర పింఛన్ ఉంటే రూ.2,500 సాయం అందదని, రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలని, చనిపోయిన యజమానుల స్థానంలో కుటుంబీకులు దరఖాస్తులు చేసుకోవడం ఎలా, కిరాయి ఇండ్లల్లో ఉండే పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తిస్తుందా, ఖాళీ స్థలం ఇస్తారా, రూ.5లక్షల సాయం అందిస్తారా.., అలాగే కూలీ పనులు చేసుకుంటూ గ్రామాలను విడిచి పట్టణాల్లో ఉంటున్న పేదలు ఎక్కడ దరఖాస్తులు చేసుకోవాలి, సొంత గ్రామాల్లో రేషన్ కార్డులు లేకుంటే ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తిస్తుందా, ఇప్పటికే రైతుబంధు అందుతుంటే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలా, జనవరి 6 వరకే దరఖాస్తు చేసుకోవాలా అనే పలు సందేహాలు నెలకొనగా స్థానికంగా ఉన్న అధికారులు సమాధానం ఇవ్వలేకపోయారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామ స్థాయిలోనూ అవగాహన కల్పించడం జరిగేది. దీనివల్ల కొత్త పథకాల దరఖాస్తులో ప్రజలకు సందేహాలు కలిగేవి కావు. ఈసారి కేవలం ఉమ్మడి జిల్లా స్థాయిలో అధికారుల సమీక్షనే జరిగింది. దీనివల్ల అధికారులు, సిబ్బందికే అవగాహన లేకపోవడంతో దరఖాస్తుల్లో సందేహాలు నెలకొన్నాయి. సోషల్ మీడియాలోని ప్రచారాలతోనే సభలకు హాజరుకావడంతో దరఖాస్తుదారులను గందరగోళానికి గురి చేసింది. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉన్నది. కాగా ఉదయం నుంచే దరఖాస్తులకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంది. గత పదేండ్లలో వివిధ పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉండగా ప్రస్తుతం సభలు నిర్వహించడంతో గుంపులుగా తరలివచ్చిన ప్రజలతో అధికారులకు ఇబ్బంది కలిగింది. మొత్తం మీద తొలిరోజు సందడిగా ప్రారంభమైన ప్రజాపాలన పలు ప్రజల సందేహాలకు చోటిచ్చింది.

ఎగబడిన ప్రజలు

- ఫ్లెక్సీలోక నిపించనిక లెక్టర్, జెడ్పీ చైర్మన్ ఫొటోలు

వనపర్తి, డిసెంబర్ 28 : ఆరు గ్యారెంటీల కోసం కాంగ్రెస్ సర్కారు దరఖాస్తులు స్వీకరిస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సరిపడా దరఖాస్తులను అందుబాటులో ఉంచలేదు. దీంతో ఒక పక్క కార్యక్రమం నడుస్తున్నా.. ప్రజలు ఒక్కసారిగా దరఖాస్తు ఫారాల కోసం కౌంటర్‌లోని ఆర్‌పీలపై ఎగబడ్డారు. ప్రజలు సమన్వయం పాటించాలని, ప్రతి ఒక్కరికీ అందజేస్తామని, ఫారాలను జిరాక్స్ తీసుకొని దరఖాస్తు చేసుకున్నా సరిపోతుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి సర్ది చెప్పారు. కాగా, ప్రజాపాలన వేదికలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వార్ ఫొటోలు కనబడకపోవడంతో ప్రజలు కొంత అసహనానికి గురయ్యారు. ఇది అధికార పార్టీ ప్రోగ్రామా లేక ప్రభుత్వ కార్యక్రమమా అని చర్చించుకున్నారు. మున్సిపల్, డీఆర్‌డీవో అధికారులు ఈ కార్యక్రమానికి బాధ్యులుగా వ్యవహరించారు. కానీ అధికారులనుసం ప్రదించగా ఎవరూ స్పందించలేదు.

వేదికపై ఉన్న ఫ్లెక్సీలో కనబడని జెడ్పీ చైర్మన్, కలెక్టర్ ఫొటోలు

దరఖాస్తుల కొరత

- చెబుతున్నది ఒకటి.. చేస్తున్నది మరొకటి
- ఫారంలు జిరాక్స్ తీసుకోవాలని సూచిస్తున్న అధికారులు
- గ్రామాల్లో వీలులేకపోవడంతో జనం ఇబ్బందులు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 28 : మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో మొదటి రోజు ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల కొరత వేధిస్తున్నది. అధికారులు ఇంటికో దరఖాస్తు మాత్రమే పంపిణీ చేయగా.. ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉండడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. అవసరమైన వారు జిరాక్స్ చేయించుకొని దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు సూచించినా.. గ్రామీణ ప్రాంతాల్లో జిరాక్స్ తీసుకొనే వీలులేక పట్టణ ప్రాంతాలకు వెళ్లి జిరాక్స్ తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో ప్రజాపాలన నిమిత్తం బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేలు ఈ విషయంపై క్లారిటీ ఇవ్వాలని పలు ప్రశ్నలు సంధించినప్పటికీ కేవలం నోటి మాట వరకు మాత్రమే ఆగిపోయాయి. ముందుగానే ప్రజాప్రతినిధులు చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం దరఖాస్తు కొరత తీవ్రంగా వేధించింది. నేటి నుంచి మిగిలిన గ్రామాల్లోనైనా దరఖాస్తు కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

కొనగట్టుపల్లిలో ప్రజలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న ప్రజాపాలన కేంద్రం

మొగ్గుచూపని ప్రజలు

- అంతంతమాత్రంగానే దరఖాస్తులు

హన్వాడ, డిసెంబర్ 28 : ప్రజాపాలనపై మొదటిరోజు ప్రజలు ఆసక్తి కనబర్చలేదు. మండలంలోని కొనగట్టుపల్లి, యారోనిపల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన నిర్వహించారు. కొనగట్టుపల్లిలో 367 దరఖాస్తులు రావాల్సి ఉండగా కేవలం 130 మాత్రమే వచ్చాయి. యారోనిపల్లిలో 110 వచ్చాయి. ఆరు గ్యారెంటీల్లో ఎక్కువగా పింఛన్, రేషన్ కార్డులు, ఇండ్లకు దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తాసీల్దార్ కిష్టానాయక్ మాట్లాడుతూ దరఖాస్తు ఫారంను నింపేందుకు ఇతర శాఖల నుంచి 10 మందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రజాపాలన కార్యక్రమం వద్ద వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో దరఖాస్తులు ఇవ్వకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జనవరి 6 వరకు పంచాయతీ కార్యదర్శికి అందజేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయనిర్మల, సర్పంచ్ మానస, ఎంపీటీసీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గద్వాల మున్సిపాలిటీలోద రఖాస్తులుసీ్వకరిస్తున్నఅధి కారులు

మాకే తెల్వదు.. మీకేం చెప్తాం..!

- సందేహాలు ఎన్నో.. సమాధానాలు చెప్పేదెవరు..?
- అయోమయానికి గురవుతున్న ప్రజలు
- దరఖాస్తులు మాత్రమే తీసుకుంటామంటున్న అధికారులు

గద్వాలటౌన్, డిసెంబర్ 28 : 'మాకే తెల్వదు.. మీకేం చెప్తాం.. దరఖాస్తు మొత్తం పూర్తి చేసి ఇవ్వండి.. అర్హులైతే పథకాలు వస్తాయి.. లేకుంటే రావు.. ఏం చేస్తాం మరి..' అంటూ అధికారులు ప్రజలకు చెబుతున్నారు. దరఖాస్తు ఫారంలో ఎన్నో సందేహాలు ఉన్నాయి.. సమాధానాలు చెప్పేదెవరంటూ మరో పక్క ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రజాపాలనను నిర్వహిస్తున్నది. ఈ క్రమంలో గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఏడు వార్డుల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కాగా, ఏ పథకానికి మార్కు చేయాలన్న సందిగ్ధంలో ప్రజలు పడ్డారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవద్దని ప్రభుత్వం చెప్పలేదుగా.. దరఖాస్తులు తీసుకోవాలంటూ అధికారులకు ఫారంలు అందజేశారు. మొత్తమ్మీద మొదటి రోజు దరఖాస్తుల స్వీకరణ అంతా అయోమయం.. గందరగోళం మధ్య కొనసాగింది.

కొట్రలో దరఖాస్తు ఫారాల కోసం వేచిఉన్న ప్రజలు

ప్రజల పడిగాపులు

వెల్దండ, డిసెంబర్ 28 : మండలంలోని కొట్ర గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభ మొదటి రోజే అబాసుపాలైంది. అర్జీలు పెట్టుకునేందుకు ప్రజలు ఒక్కసారిగా రావడంతో దరఖాస్తు ఫారాలు మొత్తం అయిపోవడంతో ఆ తర్వాత వచ్చిన ప్రజలు పరేషాన్‌లో పడ్డారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో రాగా వెంటనే వెల్దండ తాసీల్దార్ రవికుమార్ గ్రామ కార్యదర్శి ద్వారా ఫారాలు తెప్పించి దరఖాస్తులు తీసుకున్నారు.

దరఖాస్తు పత్రాలకోసం తోసుకుంటున్న ప్రజలు

దరఖాస్తు పత్రాల కోసం తోపులాట

ఊట్కూర్, డిసెంబర్ 28 : ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభించిన అధికారులు ప్రజలకు దరఖాస్తు ఫారాలను అరకొరగా అందించారు. ఊట్కూర్ మండలకేంద్రంలో దరఖాస్తు పత్రాల పంపిణీ సమయంలో ప్రజల మధ్య తోపులాట జరిగింది. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో పంపిణీ సయమంలో చేతికి అందిన కాడికి దరఖాస్తు పత్రాలను పట్టుకెళ్లారు. ఈక్రమంలో పోలీసులు జోక్యం చేసుకొని ప్రజలను కట్టడి చేయాల్సి వచ్చింది. చాలా మందికి దరఖాస్తు పత్రాలు అందకపోవడంతో జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించారు. ఇదే క్రమంలో దరఖాస్తు పత్రానికి జత చేయాల్సిన గుర్తింపు పత్రాలపై స్పష్టత కొరవడటంతో అవసరం లేకపోయిన తమ వద్ద ఉన్న అన్ని పత్రాలను దరఖాస్తు పత్రానికి జత చేసి అధికారులకు అందజేశారు. కొందరు జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కో దరఖాస్తు పత్రానికి రూ. 10 ప్రజల నుంచి వసూలు చేశారని ప్రజలు వాపోయారు.

తోపులాటలో చిరిగిన దరఖాస్తు ఫారం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, డిసెంబర్ 28 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. మండలంలోని బైరాపురం, బస్వాపురం గ్రామాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే విజయుడు ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దరఖాస్తు స్వీకరించే వద్ద హెల్ప్ డెస్క్‌లు, 100 కుటుంబాలకో కౌంటర్‌తోపాటు ఉచిత వైద్య శిబిరం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు కూడా జనవరి 6 వరకు గ్రామాల్లో అధికారులకు దరఖాస్తులు అందిచవచ్చన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను సర్పంచులు పూలమాల, శాలువాతో సన్మానించారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ..

తన రెండు కాళ్లు పని చేయకపోవడంతో ట్రైసైకిల్‌తో జీవనం ఇబ్బందిగా ఉందని, మూడు చక్రాల మోటర్ సైకిల్‌ను ఇప్పించాలని బస్వాపురం గ్రామానికి చెందిన నర్సింహ ఎమ్మెల్యే విజయుడును కోరారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బైరాపురం, బస్వాపురం గ్రామాల మధ్య కొనసాగుతున్న బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భీమేశ్వరరావు, తాసీల్దార్ వెంకట్రావ్, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ దేవన్న, సర్పంచులు మహేశ్వరమ్మ, శివరాం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


బస్వాపురంలోద రఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల/గద్వాల రూరల్, డిసెంబర్ 28 : లబ్ధిదారులు దరఖాస్తులను నింపిన తరువాత సంబంధిత అధికారులకు అందజేసి.. వారు ఇచ్చిన రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. ప్రజల వద్దకే అధికారులు వచ్చి సంక్షేమ పథకాలను అందించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. గద్వాల మండలం బీరెల్లి, లత్తీపురం, జమ్మిచేడు, వెంకంపేట గ్రామాల్లో గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్‌తో కలిసి ఎమ్మెల్యే బండ్ల ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అర్హులందరికీ ఒక్కరికీ అందజేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తు సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే కౌంటర్ వద్ద అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందాలని, అర్హులందరికీ పథకాలను అందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ మాట్లాడుతూ అందుబాటులో లేని వారు 6వ తేదీ వరకు ఆయా వార్డుల్లో ఉన్న అధికారులకు దరఖాస్తులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, మున్సిపల్ కమిషనర్ నరసింహ, తాసీల్దార్ నరేందర్, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, ఎంపీటీసీ రాధమ్మ, సర్పంచ్ జయమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే బండ్ల

దళారుల దందా..

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 28 : ప్రజాపాలన కార్యక్రమం గురువారం మొదలైంది. జిల్లా కేంద్రంలోని 11,23,44,49,1,3,5,19వ వార్డుల్లో అభయహస్తం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. దరఖాస్తు ఫారాలను ప్రజలకు అధికారులు ఉచితంగా అందజేస్తున్నారు. పట్టణ కేంద్రంలో దరఖాస్తుల విషయంలో కొందరు దళారులు సరికొత్త దందాకు తెరతీశారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నా కొందరు దళారులు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. ఒక్కో ఫారానికి రూ.20 నుంచి 30 వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దరఖాస్తులు ఉచితంగా ఇస్తుంటే.. మరికొందరు ఇదే అదునుగా భావించి దరఖాస్తు ఫారాలు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలు కౌంటర్లకు వచ్చి ఉచితంగా దరఖాస్తులు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యాసంగికి నీరు విడుదల చేయం

ధరూర్, డిసెంబర్ 28 : నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడు జలాశయం కింద ఆయకట్టు రైతులకు యాసంగి పంటకు సాగునీటిని విడుదల చేయడం లేదని ప్రాజెక్ట్ డీఈఈ వెంకటేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం లేకపోవడంతో నీటి నిల్వలు తగ్గాయని, అందుకే యాసంగి పంటకు నీరు విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. రైతులు అధికారులకుసహ కరించాలనికో రారు.

తెలంగాణ ఖ్యాతిని బజారుకీడుస్తున్న ప్రభుత్వం

- పేరుకు మాత్రమే ప్రజాపాలన
- అంతా ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల చేతిలోనే..
- బీఆర్ఎస్‌జి ల్లా అధ్యక్షుడు గువ్వల

వంగూరు, డిసెంబర్ 28 : అప్పుల పేరుతో తెలంగాణ ఖ్యాతిని కాంగ్రెస్ ప్రభుత్వం బజారు కీడుస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. వంగూరు మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ పొందిన వారు వెంటనే రూ.2లక్షలు బ్యాంకులో రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డిసెంబర్ 9న మాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇంతవరకు మాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తున్నాడన్నారు. యాసంగిలో ఇంతవరకు రైతుబంధు వేయకుండా వారిని అప్పులఊబీలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం కేవలం ఎంపీ ఎన్నికల కోసమే అని అన్నారు. పేరుకు మాత్రమే ప్రజాపాలన అని, పాలన మొత్తం ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల చేతిలోనే ఉందనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలు ఢిల్లీలో ప్రధాని మోదీ ముందు మోకరిల్లినా ఇంతవరకు సమాధానం రాలేదని ఎద్దేవా చేశారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ అందరినీ సమానంగా చూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామాల్లో అరాచకాలకు తెరలేపారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వ్యతిరేకతను మూటగట్టుకున్న ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు గణేశ్‌రావు, రాజారంగారావు, నర్సింహారెడ్డి, జంగయ్య, సూర్యనాయక్, సత్యం, జీవన్, రాజు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్నగువ్వల బా లరాజు

రూ.1.50 లక్షలు చోరీ

- పట్టపగలే కారు అద్దాలు పగలగొట్టి దొంగతనం

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 28 : నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో నిలిపి ఉన్న కారు అద్దం పగలగొట్టి రూ.లక్ష యాభై వేలను ఎత్తుకెళ్లిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి బాధితుడు శంకర్ తెలిపిన వివరాల ప్రకారం .. బిజినపల్లి మండలం నందివడ్డేమాన్ గ్రామానికి చెందిన చిదిరే శంకర్ గురువారం జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.లక్షాయాభైవేలను డ్రా చేసుకున్నాడు. డబ్బులను కారులో హ్యాండ్‌బ్రేక్ వద్ద పెట్టుకొని బస్టాండ్‌లోని కారును ఆర్టీసీ పార్కింగ్ పక్కన నిలిపి టీ తాగడానికి వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు డ్రైవర్ వైపు గల అద్దాన్ని పగలగొట్టి కారులోని నగదును ఎత్తుకెళ్లారు. ఐదు నిమిషాల్లో కారు వద్దకు చేరుకున్న బాధితులు చోరీ జరిగిన విషయం గమనించి బాధితుడు ఆర్టీసీ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చుట్టుపక్కల సీసీ పుటేజీలను పరిశీలించి విచారణ చేపట్టారు.

చోరీ జరిగిన కారు